ప్రజాశక్తి

సోమవారం 7 ఆగస్టు 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆదుకోకపోతే అవస్థలే..

- ఆందోళనకరంగా విద్యుత్ ఛార్జీలు
- నేడు ఫెర్రో పరిశ్రమ కార్మికుల ధర్నా
- ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఫెర్రో పరిశ్రమలకు పెంచిన విద్యుత్ ఛార్జీల భారం ప్రభావం కార్మికుల జీవనోపాధిపై పడింది. ఎనర్జీ ఇన్సింటివ్ ఇండస్ట్రీస్ పేర డిమాండ్ ఛార్జీలను పెంచడంతో ఫెర్రో ఎల్లాయిస్ ఉత్పత్తి వ్యయం పెరిగింది. ముడిసరుకుల ధరలు పెరగడంతో యాజమాన్యాలు కంపెనీల నిర్వహణపై సతమతమవుతున్నాయి. పరిశ్రమలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కంపెనీలు వినియోగిస్తున్న విద్యుత్‌పై ఈ ఏడాది డిమాండ్ ఛార్జీలు, ట్రూఅప్, ఇంధన ఛార్జీలు, వినియోగ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఇడి) పెంచింది. యూనిట్‌కు ఆరు పైసలున్న ఇడి ఛార్జీలను రూపాయికి పెంచడంతో ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు విలవిల్లాడుతున్నాయి. ఈ భారాలు భరించలేక యాజమాన్యాలు పరిశ్రమలు మూసేయాలని ఆలోచిస్తున్నాయి.

జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో అభిజిత్, మైతాన్, లలిత, సుందరం ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మంది సెజ్ నిర్వాసిత, పరిసర పేద కుటుంబాల ప్రజలు ఉపాధి మిగతా 2లో..



జిల్లాలోని ఓ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

ఫెర్రో పరిశ్రమలకు ప్రోత్సాహకాలివ్వాలి



ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై ఏడాదికి రూ.700 కోట్ల భారం పడుతుంది. పరిశ్రమల యాజమానులు ఆర్థిక భారం భరించలేక కంపెనీలను మూసేస్తామని అంటున్నారు. కార్మికులకు జీతాలు పెంచడంలేదు. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి. కార్మిక కుటుంబాల జీవనోపాధి దెబ్బతినకుండా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

ఆర్.రాము, సిఐటియు అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు

'మహా' అడ్డగోలుతనం

- ఒక స్పోర్ట్స్ డైరెక్టర్ అడిషనల్ కమిషనర్‌గా ఎలా అయ్యారు ?
- నియమావళి ఉల్లంఘించి ఆ వ్యక్తికి అంత ప్రయోజనమా !
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రశ్నించి 10 రోజులైనా చలనం ఏదీ ?
- జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మౌనం వెనుక కారణమేంటి ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఆ అధికారి మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి)లో లోతుగా పాతుకు పోయాడు' - జివిఎంసిలో చిరు ఉద్యోగి నుంచి ఉన్నతాధికారుల వరకూ నిరభ్యంతరంగా చెప్పే మాట ఇది. ఫలానా రాజకీయ పార్టీ అనే దాంతో నిమిత్తం లేకుండా రాజకీయ నాయకుల అండతో జివిఎంసి కమిషనర్లను సైతం తన బుట్టలో వేసుకోవడం సదరు వ్యక్తికి ఆనవాయితీ. తాజాగా ఏం జరిగిందో.. వ్యవహారం ఎక్కడ బెడిసికొట్టిందో తెలియదుగానీ సదరు అధికారిపై కొరడా పై నుంచి పట్టుకోవాల్సి వచ్చినట్టుంది. స్పోర్ట్స్ డైరెక్టర్ క్యాడర్‌గా ఉన్న వ్యక్తి అడిషనల్ కమిషనర్‌గా చెలామణి అవుతుంటే ఏం చేస్తున్నారంటూ పై నుంచి ఆర్డర్‌లో తప్పుపట్టడం జరిగింది. ఇటీవలే జివిఎంసి కౌన్సిల్‌లోనూ సదరు అధికారి మాటలకు కొంతమంది కార్పొరేటర్లు నొచ్చుకున్న సంగతి తెలిసిందే. ఆర్డర్ కాపీ వచ్చినా అమలు చేయకుండా పాత ప్రతిపాదన ప్రకారమే జివిఎంసి నడుస్తూ, ఆ ఆర్డర్‌ను దాటవేయడం చూస్తే నగర పాలక సంస్థలో సదరు వ్యక్తి పట్టు ఎంతో రూఢీ అవుతోంది.

నియమాలు పట్టవా ?

ఏకంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ (ఎంఎయుడి) నుంచి జివిఎంసికి జులై 27న తాకీదు వచ్చింది. 'వై.శ్రీనివాసరావు అనే ఒక వ్యక్తికి ప్రయోజనం చేకూర్చడానికి, తక్కువ వేతన స్కేల్‌లో ఉన్న డైరెక్టర్ స్పోర్ట్స్ పోస్టును జాయింట్ డైరెక్టర్ (ఎంఎ)కి వివిధ సర్వీసులలో ఎక్కువ పే స్కేల్‌లో అప్‌గ్రేడ్ చేయడానికి ఎలాంటి నియమం పాటించారు ?' అంటూ ప్రశ్నల వర్షం కురిసింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి నుంచి ఈ ఆర్డర్ వచ్చి పది రోజులైనా జివిఎంసి ఉన్నతాధికారుల్లో చలనం లేదు. సీనియారిటీ సమస్యలను పట్టించుకోకుండా ఎలా అప్‌గ్రేడేషన్ చేస్తారంటూ పై నుంచి స్పెషల్ సెక్రటరీ నేడు కొరడా ఝుళిపించారు. ఇంత జరుగుతున్నా జివిఎంసికి కొత్తగా వచ్చిన యువ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ వ్యవహారంపై మౌనం పాటించడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది తాజాగా చర్చనీయాంశంగా మారింది.

దువ్వాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ప్రారంభం

▶ వార్త 2లో..

విశాఖలో అక్రమ అరెస్టులు

▶ వార్త 2లో..

భారత రాజకీయాల్లో ఎన్‌టిఆర్‌ది బలమైన ముద్ర

▶ వార్త 2లో..

బీచ్‌ల అభివృద్ధి పేరిట

మత్స్యకారుల ఉపాధికి హాని కలిగిస్తే ఊరుకోం

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో బీచ్‌ల అభివృద్ధి పేరుతో మత్స్యకారుల ఉపాధికి హాని తలపెడితే ప్రతిఘటన తప్పదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖలో 15 బీచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన వాటిలో భీమునిపట్నం నియోజకవర్గం పరిధిలోని పాండవుల బీచ్, అన్నవరం బీచ్, పెదనాగమయ్యపాలెం బీచ్, భీమిలి బీచ్, చలం బీచ్, చేపలుప్పాడ బీచ్, రంద్రిరాక్ బీచ్, తిమ్మాపురం బీచ్, తూర్పు నియోజకవర్గం పరిధిలోని మధురవాడ బీచ్, ఐటి బీచ్, ఎండాడ బీచ్, సీతకొండ బీచ్, లాసెన్స్‌బే బీచ్, గాజువాక నియోజకవర్గంలోని యారాడ 1, 2 బీచ్‌లున్నాయన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో వీటిని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఎవరికీ అభ్యంతరం లేదుగానీ.. జిల్లా కలెక్టర్ నిర్వహణలో, వివిధ విభాగాలకు సంబంధించిన అధికారులు, కమిటీలతో జరిగిన సమావేశంలో పర్యాటకుల సదుపాయాలు, పనులకు సంబంధించిన అంశాలు మాత్రమే చర్చించినట్లు ప్రకటనలు వచ్చాయన్నారు. సముద్రాన్ని నమ్ముకొని వేలాది మంది మత్స్యకారులు జీవిస్తున్నారని తెలిపారు. వేట, సముద్ర మత్స్యసంపద అమ్మకం వీరి జీవనాధారమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 15 బీచ్‌లలో మత్స్యకారులు తమ బోట్లను నిలుపుకునే బీచ్‌లున్నాయన్నారు. మత్స్యకారుల వేటకు, ఉపాధికి నష్టం జరుగుతుందేమోనన్న ఆందోళన వారిలో ఉందని తెలిపారు. వీరి గురించి ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటున్నట్లు లేదన్నారు. గంగవరం పోర్టు, విసిటిపిసి ఏర్పడినప్పుడు మత్స్యకారులు ఉపాధి కోల్పోయారన్నారు. మరోవైపు సముద్రవేట, మిగతా 2లో..

జైలులో మౌలిక వసతుల కల్పన పెద్ద సవాల్

- ఖైదీల ఆరోగ్యంపై దృష్టి - గంజాయి కేసుల్లో వచ్చేవారికి ప్రత్యేక కౌన్సెలింగ్
- 'ప్రజాశక్తి'తో విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'జైలు అంటేనే ఒక విషాదం.. ఎటు చూసినా నాలుగోడలే కనిపిస్తాయి. సొంత వారుండరు. పిలిస్తే పలికే వారూ కష్టమే. పెట్టింది తినాల్సిందే. నచ్చింది తినాలంటే కుదరదు. అయితే కోరి కోరి జైలుకు వెళ్లాలని ఎవ్వరూ అనుకోరు. కొంతమందిని చూస్తే నిజంగా వీరు ఆ నేరం చేసారా ? అనేలాగ ప్రవర్తన ఉంటుంది. శిక్ష పడిన వారంతా ఒకేలా ఆలోచించరు. నేరం రుజువయి శిక్ష అనుభవించే వారి మనస్సు పరిపరి విధాలుగా పరుగులెడుతుంది. తప్పుచేయబట్టే ఈ శిక్ష అనుకునే వారు కొందరైతే.. జన్మలో మళ్లీ ఇక్కడకు రాకూడదు అనుకునే వారు ఇంకొందరు. జైలుకు ఏదో ఒక రోజు వెళ్లాల్సిందే అనుకుని నేరాలు చేసేవారూ లేకపోరు. విశాఖ సెంట్రల్ జైలుకెళితే ఇత్యాదివారే కనిపిస్తారు. 'ప్రజాశక్తి' ఇటీవల సెంట్రల్ జైలులో ఖైదీల పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లగా జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ అనేక అంశాలను వెల్లడించారు. జైలులో మౌలిక వసతుల కల్పన పెద్ద సవాలు అని తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపై దృష్టి పెట్టామన్నారు. జైలు పరిస్థితులను, ఖైదీల స్థితిని ఆయన వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..



జైలులో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి ?

విశాఖ సెంట్రల్ జైలు సుమారు వంద ఎకరాల విశాల ప్రాంగణంలో ఉంది. దీంట్లో 60 ఎకరాలు లోపల ఖైదీల గదులు, కార్యాలయాల స్థలాలు ఉంటాయి. చిన్న పిల్లలు, మొదటిసారి నేరానికి పాల్పడిన వారిని వేరు చేసి మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి..

ఆదుకోకపోతే అవస్థలే..

పొందుతున్నారు. పరిశ్రమలు మూసేస్తే ఆ కుటుంబాలు ఉపాధి కోల్పోనున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహల్లేక, అంతర్జాతీయ మార్కెట్లో ధరల్లేక, ముడిసరుకు ధరలు పెరుగుతుండడంతో సరోజిని, అల్లన్స్ పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. విద్యుత్ ఛార్జీలు పెంచడంతో టన్నుకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తోందని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇతర దేశాల్లో యూనిట్ రూపాయి యాభై పైసల నుంచి రెండు రూపాయల మధ్య వుండగా, రాష్ట్రంలో యూనిట్ ఎనిమిది రూపాయలకుపైగా వున్నట్లు చెబుతున్నారు. ఏపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) నిబంధనల ప్రకారం సామర్థ్యపు విద్యుత్ వినియోగించకపోయినా లోడ్‌లో ప్రతినెలా 80 శాతం డిమాండ్ ఛార్జీలను పరిశ్రమలు చెల్లించాల్సివుంది. పరిశ్రమలపై పడుతున్న విద్యుత్ భారాలను ఉపసంహరించుకొని కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా చూడాలని సిఐటియు నేతృత్వంలో ఫెర్రో ఎల్లాయీస్ కంపెనీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నారు.

జైలులో మౌలిక వసతుల కల్పన పెద్ద సవాల్

పెడతాం. గిరిజనులను వేరుగానే వుంచుతాం. ఖైదీలు విడుదలయ్యాక తోటి ఖైదీలను సంప్రదించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జైలు కెపాసిటీ 980 మంది. ప్రస్తుతం 1900 మంది వరకూ ఖైదీలు ఉన్నారు. గంజాయి కేసులే అధికం. గిరిజనులు సుమారు వెయ్యి మంది ఉన్నారు. శిక్ష పడిన 400 మంది ఖైదీల్లో 100 మంది మహిళలు ఉన్నారు. వచ్చి పోయే రిమాండ్ ఖైదీలు 1500 మంది ఉంటారు. మౌలిక వసతుల కల్పన అనేది నిరంతర ప్రక్రియ. ఖైదీలను కేటగిరీలను బట్టి వేర్వేరుగా ఉంచుతున్నాం. ముఖ్యంగా వారి వారి ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ప్రతి ఖైదీకి వైద్య సేవలు అందేలా వైద్యులను అందుబాటులో ఉంచుతున్నాం. 50 బెడ్స్ ఆసుపత్రి లోపల ఉంది. ఉదయాన్నే ఖైదీలను 5.30 గంటలకు నిద్రలేపుతాం. యోగా, మెడిటేషన్ చెప్పిస్తాం. మంచి విషయాలపై దృష్టి మరలేలాగ కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. వైద్య పరంగా సేవలందించేందుకుగానూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి ఖైదీలు వచ్చేలాగ విశాఖ సెంట్రల్ జైలులో కృషిచేసి సాధించాం.

ఖైదీలకు పెట్టే ఆహారంపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు ?

మంచి భోజనం ఖైదీలకు అందించే ప్రయత్నం తొలినుంచీ జరుగుతోంది. లోపలే డెయిరీ కూడా ఉంది. 75 ఆవులు, గేదెలు ఉన్నాయి. రోజుకు 70 లీటర్ల పాలు వస్తాయి. అన్నీ ఖైదీలకే వాడతాం. బయట నుంచి కూడా పాలు కొనుగోలు చేస్తాం. స్టీల్ ఫర్నీచర్, బుక్ బైండింగ్, బొకేల తయారీ, టవల్స్ తయారీ, బీరువాలు, ఐరన్ బల్లలను ఖైదీలే చేపడతారు. వాటితోనూ ఆదాయం లభిస్తుంది. జైలు బయట, మార్కెట్‌లోనూ స్టాల్స్ నడుపుతున్నాం.

గంజాయి కేసుల్లో గిరిజనులు అధికంగా వస్తున్నారా ?

అవును. గంజాయి కేసుల్లో 14 రోజుల రిమాండ్ ఉంటుంది. ఈలోగా బెయిలు తెచ్చుకోవాలి. కానీ వారికి తెలియదు. ఆర్థిక స్తోమత ఉండదు. ష్యూరిటీలు తెచ్చుకోలేక శిక్ష పూర్తయ్యే వరకూ జైలులోనే ఉండిపోతున్నారు. గంజాయి అనేది బయట నుంచి జరిగే మాఫియా. స్మగ్లర్లు చేసే పనికి ఏజెన్సీలో గిరిజనం చిక్కుల్లోపడుతున్నారు.

గంజాయి కేసుల్లో ఫాస్ట్ ట్రాక్ విచారణ వంటి ప్రత్యేక పరిస్థితులు కల్పించవచ్చా ?

ప్రభుత్వ స్థాయిలో జరగాల్సిన నిర్ణయం. ఈ కేసులో పట్టుబడితే రూ.లక్షల్లో (గంజాయి పరిమాణానికి తగ్గట్టుగా) నగదు చెల్లించుకుని బయటకు రావాలి. గిరిజనులకు సాధ్యం కాదు. గిరిజన ప్రాంతాల్లో పేదరికం వల్ల అమాయకులైన వారు ఈ వ్యవహారాల్లో చిక్కుకుంటున్నారు. మాఫియా వల అలా ఉంటుంది. చాలా మంది టూరిస్టుల్లాగ అరకు చూడాలని వచ్చేవారు ఈ గంజాయి వ్యాపారులుగా ఉండడం రూఢీ అవుతోంది. వీరంతా గిరిజనులను వాడుకుంటారు.

ఖైదీల వ్యవహారాలపై నిఘాకు అవసరమైన సిబ్బంది ఉన్నారా ?

సెంట్రల్ జైలులో మొత్తంగా 170 మంది వరకూ సిబ్బంది ఉన్నారు. ఇంకా 23 ఖాళీలున్నాయి.

మత్స్యకారుల ఉపాధికి హాని కలిగిస్తే ఊరుకోం

ఆదాయం, ఉపాధి తగ్గి కుటుంబాల జీవనం కష్టమవుతున్న నేపథ్యంలో మత్స్యకారుల మధ్య వైషమ్యాలు పెరుగుతున్న దుష్పలితాలను విశాఖ చవిచూసిందన్నారు. పర్యాటక రంగం పేరుతో వీరి ఉపాధికి ఏ మాత్రం హాని జరిగినా మత్స్యకారుల జీవితాలు మరింత దుర్భరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. మత్స్యకారుల ఉపాధికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధికి హాని లేని విధంగా పర్యాటక రంగం అభివృద్ధి జరగాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు

నేడు మున్సిపల్ కార్మికుల ధర్నా నేపథ్యంలో పోలీసు నిర్బంధం - ఖండించిన సిఐటియు



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో నూకరాజు, జగన్

ప్రజాశక్తి - పెందుర్తి, కలెక్టరేట్

తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 7న జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలకు పారిశుధ్య కార్మికులు సిద్ధమవుతున్న నేపథ్యంలో వారికి నాయకత్వం వహిస్తున్న నేతలపై పోలీసులు ముందస్తు నిర్బంధం ప్రయోగించారు. ఆదివారం సాయంత్రం సిఐటియు విశాఖ నగర కార్యదర్శి బి.జగన్‌ను, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు నూకరాజును వారి ఇళ్లకు వెళ్లి అరెస్టు చేసి పెందుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటనలో ఖండించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరితే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. తక్షణమే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పోలాకి శ్రీనివాసరావు హౌస్ అరెస్టు

పి.ఎం.పాలెం : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళనకు సిద్ధమవుతున్న ఎపి విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ కన్వీనర్ పోలాకి శ్రీనివాసరావును పోలీసులు పి.ఎం.పాలెంలో ఆదివారం హౌస్ అరెస్టు చేశారు.

భారత రాజకీయాల్లో ఎన్‌టిఆర్‌ది బలమైన ముద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత రాజకీయాలలో నందమూరి తారకరామారావు బలమైన ముద్ర వేశారని, అభివృద్ధి, సంక్షేమానికి సరికొత్త నిర్వచనంగా ఆయన పాలన సాగిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దసపల్లా హోటల్‌లో ఎన్‌టిఆర్‌పై వెలువరించిన శాసనసభ ప్రసంగాలు, చారిత్రక ప్రసంగాలు, శకపురుషుడు అనే మూడు గ్రంథాలపై సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌టిఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులైన ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్, వెబ్ సైట్ కమిటీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ టిడి.జనార్దన్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు సబ్సిడీ బియ్యం పథకాన్ని, పక్కా గృహాల స్కీంను, మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన వాటా మొదలైన చారిత్రక నిర్ణయాలను అమలు చేసి సమాజంలో పేదల జీవన ప్రమాణాలు పెంచారన్నారు. ఎన్‌టిఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సినిమాలలో 40 విభిన్న పాత్రలు పోషించారన్నారు. ఇది ఒక రికార్డు అన్నారు.



సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం విశాఖలో ఆదివారం సందడిగా సాగింది. 1997లో ఇక్కడ పదో తరగతి చదివిన వీరంతా ప్రస్తుతం వివిధ బాధ్యతల్లో ఉన్నారు. ఆదివారం ఒకేచోట కలుసుకుని జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడిగా గడిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, నందా, రమేష్, ఎం.మోహన్, వెంకటరమణ, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు

దువ్వాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉక్కునగరం : అమృత్ భారత్ పథకంలో భాగంగా దువ్వాడ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. దేశ వ్యాప్తంగా 508 స్టేషన్ల అభివృద్ధికి వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయగా, అందులో దువ్వాడ స్టేషన్ ఉన్నట్టు డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్‌ను రూ.26 కోట్లతో మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఎంపీ జివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ విశాఖపట్నం అభివృద్ధిపై కేంద్రం దృష్టి పెట్టిందన్నారు. వాల్తేరు రైల్వే డివిజన్‌లో త్వరలో చేపట్టబోయే పనులను వివరించారు. విశాఖలో మెగా ఫిషింగ్ హార్బర్, స్మార్ట్ సిటీని అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బిజెపి నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, ఎయు విసి ప్రసాదరెడ్డి, పద్మశ్రీ కె.సూర్యారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో జివిఎల్, ఎంవివి. సౌరభ్ ప్రసాద్

అనధికార విద్యుత్ కోతలు.. ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎండల తీవ్రత, ఉక్క పోతతో అల్లాడిపోతున్న ప్రజలకు వేళాపాల లేని విద్యుత్ కోతలు ఇబ్బందిపెడుతున్నాయి. వర్షాకాలం వచ్చింది కదా ఇక నుంచి విద్యుత్ కోతలు ఉండవని ఆశపడ్డ వినియోగదారులకు అడియాసే మిగిలింది. ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో నెలలో రెండు నుంచి మూడు వారాలు విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్టు కొమ్మలు తొలగింపు, మరమ్మత్తులు అని చెప్పి అధికారికంగా ఆరు గంటలు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. అనధికారికంగా రోజులో ఎన్ని సార్లు కోతలు విధిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్నిసార్లు తెల్లవారు జామున కూడా విద్యుత్ కోతలు పెడుతుండటంతో గృహ, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామున విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ఇంట్లో బోర్లు వేసుకునే పరిస్థితి ఉండదు. టిఫిన్ కొట్లుకు వ్యాపారాలు ఉండవు. విద్యుత్ కోతలతో వర్క్ ఫ్రమ్ హోంలో విధులు నిర్వహిస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా అవస్థలు పడుతున్నారు. నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని సమీక్షా సమావేశాల్లో అధికారులు చెబుతున్నారే తప్ప, క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనధికార విద్యుత్ కోతలు లేకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

వేగవంతంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో గత మూడు రోజులుగా విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పంచాయతీ నిధులు రూ.1.17 లక్షలతో రోడ్డుకిరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరిస్తున్నారు. ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేస్తున్నారు. సర్పంచ్ పొట్నూరు చాయా గౌతమి, ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, వైసిపి నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు, వార్డు సభ్యుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.



విద్యుత్ స్తంభాలను మారుస్తున్న విద్యుత్ సిబ్బంది

చలో ఢిల్లీకి పద్మశాలి సంఘం ప్రతినిధులు



చలో ఢిల్లీకి వెళ్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యాన ఢిల్లీలోని ఎర్రకోట నుంచి రాజ్ ఘాట్ వరకు ఆగస్టు 7న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పలువురు స్థానిక పద్మశాలి సంఘం ప్రతినిధులు తగరపువలస నుంచి ఆదివారం బయల్దేరారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వానపల్లి సత్య, యువజన సంఘం కార్యదర్శి ఇమంది సోమేష్, వానపల్లి నరసింహారావు, మహిళా సభ్యులు మోటూరి కనక రత్నం చలో ఢిల్లీ కార్యక్రమానికి బయల్దేరారు.

ఏడేళ్లుగా పరారీలో ఉన్న నిందితుడి ఆచూకీ చెప్పాలి

ప్రజాశక్తి -మధురవాడ : గత ఏడేళ్లుగా 498-ఎ కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తి పోలీసులు కంట పడకుండా తప్పించుకు తిరుగుతున్నాడని, ఎవరికైనా తెలిస్తే ఆచూకీ తెలపాలని పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ కోరారు. పిఎం పాలెం పరిధిలోని ఎండాడ గ్రామానికి చెందిన ముదిలి లక్ష్మి నాగ జాహ్నవిని ఆమె భర్త ముదిలి బాబు వరకట్నం వేధింపులకు గురిచేసినందుకుగాను 2016 సంవత్సరంలో పిఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముద్దాయి అయిన గాజువాక జోగవానిపాలెంకు చెందిన ముదిలిబాబు భీమినిపట్నం 16వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతుండటంతో ఆయనపై న్యాయమూర్తి ప్రాక్లేమేషన్ అరెస్టు వారెంట్ జారీచేశారని తెలిపారు. నిందుతుడు గురించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పిఎం.పాలెం స్టేషన్ సిఐ రామకృష్ణ (9440796060)కు సమాచారం అందించాలని కోరారు.

అప్సా అనుబంధంగా జిప్సా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ సుందరరామ్

ప్రజాశక్తి -గాజువాక : అప్సా అనుబంధ సంస్థగా గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) పనిచేస్తుందని అసోసియేషన్ అధ్యక్షులు పాలవలస భాస్కరరావు తెలిపారు. జిప్సా ఆధ్వర్యాన పాత గాజువాకలోని యశోధా విద్యా నికేతన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా, రాష్ట్ర వ్యాప్త సమస్యలపై జిప్సా అభిప్రాయాలు కూడా ఆయా వేదికలపై వినిపించేందుకు వీలుగా ప్రముఖ రాష్ట్ర సంఘమైన అప్సాతో అనుబంధం చేస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అప్సా రాష్ట్ర చైర్మన్ వి.సుందరరాం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఈ అనుబంధాన్ని చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేట్ పాఠశాలల సమస్యలు, ప్రి ప్రైమరీ తరగతుల గుర్తింపు, ట్యాక్సులు, పుస్తకాలు, సిలబస్ తదితర అనేక అంశాలను సభ్యులకు వివరించారు. అనంతరం ఆయన జిప్సాను అప్సా యొక్క అనుబంధ సంస్థగా చేర్చుకుంటున్నట్లు పత్రాలను సభాముఖంగా అందించారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర కార్యదర్శి ఎం.జనార్ధన్, విశాఖ జిల్లా అధ్యక్షుడు జె.సోమశేఖర్, విజయనగరం అధ్యక్షుడు సింహాచలం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు, జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, జగ్గారావు, శోభన్‌బాబు, సుమారు 70 పాఠశాలల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో వర్షం, వాడుక నీటిని మళ్లించాలని, రైతు భరోసా కేంద్రం భవనం వెనుక చెత్తను తొలగించాలని, బిఆర్ అంబేద్కర్ పార్కు ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పతివాడ రాంబాబు అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 3, 4 నెలలుగా నెలకొన్న ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

వారాహి యాత్రకు సిద్ధం

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖ జిల్లాలో ఈ నెల 10 నుండి 19వ తేదీ వరకు నిర్వహించే జనసేన వారాహి యాత్రకు కార్యకర్తలు సిద్ధం కావాలని భీమిలి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల కోరారు. ఆనందపురం కూడలిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వారాహి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ముందుగా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన నాయకులు శాఖరి శ్రీనుబాబు, కృష్ణయ్య, చంద్రరావు, పరిమి భువనేశ్వరి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం జనసేన నాయకులు పాల్గొన్నారు.

వెల్లంకిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం : శ్రీ సత్య సాయిబాబా శతజయంతోత్సవాల్లో భాగంగా విశాఖపట్నం సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యాన మండలంలోని వెల్లంకిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఎంపిటిసి సభ్యులు కాకర వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు పడాల అప్పలనాయుడుతో కలిసి సత్యసాయి సేవా సంస్థల జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఆర్ఎ.నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్ర, దంత, కేన్సర్, గైనిక్, జనరల్ రోగులను వైద్యులు పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 10మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి విశాఖ ఐ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకర సురేష్‌కుమార్, శ్రీ సత్య సేవా సంస్థల జిల్లా కో-ఆర్డినేటర్ మానాపురం సత్యసాయి కుమార్, టెక్నో కో-ఆర్డినేటర్ ఎ.రాంప్రసాద్, మెడికల్ ఇన్‌ఛార్జి సాయికుమార్, సత్యనారాయణ, ఎస్.రమేష్, టి.సూర్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఆనందపురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో ఆనందపురం గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. షటోకాన్ కరాటే అకాడమీ కోచ్ సాయి కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటున్న కుప్ప రేవంత్ కుమార్(6) కథ, కుంతీ విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. టి.సాత్విక్ (5) రెండు గోల్డ్ మెడల్, కె ప్రసాద్ కథ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కుప్ప రేవంత్‌కుమార్, టి.సాత్విక్‌లు సెప్టెంబర్ 9,10 తేదీలో కేరళలో జరిగే సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు.

గీతం దూర విద్య కోర్సులలో అడ్మిషన్లు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం దూర విద్యా విధానంలో ఎమ్ఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2023 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఎల్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలో కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టు పడకుండా ఉన్న చోడవరం పట్టణం దొడ్డి వీధికి చెందిన గార్ల రమేష్ అనే వ్యక్తిని ఆదివారం చోడవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిఐ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొంతకాలంగా చోడవరం పట్టణంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతూ ఉన్న రమేష్‌ను తమకు నమ్మకమైన సమాచారం మేరకు అరెస్టు చేయగా పలు దొంగతనాలకు పాల్పడినట్టు నిందితుడు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడి వద్దనుండి 14 తులాల బంగారం, 9000 రూపాయలు నగదు రాబట్టామని తెలిపారు. దీనిపై కేసు నమోదు కోర్టుకు తరలించనున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు నలభై ఏళ్ళ సుదీర్ఘ కాలం తర్వాత ఒకే చోట కలుసుకున్న స్నేహితులుగత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 1983లో ఇదే పాఠశాలలో ఏడో తరగతి చదివినవారు, 1986-88లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూప్ చదివిన విద్యార్థులు కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 2014లో ప్రారంభమైన ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి ఏటా ఈ తరహా కార్యక్రమాలు చేపడుతుండటంపై హర్షం వెలిబుచ్చారు. కాసేపు ఆటాపాటలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. వారు చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.2 లక్షలు అందజేశారు. అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు రూ.50 వేలు అందజేశారు.

అణ్వస్త్ర రహిత ప్రపంచానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - ఆరిలోవ : అణ్వస్త్ర రహిత ప్రపంచాన్ని సాధించేందుకు అందరం కృషి చేయాలని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలిజియస్ ఫ్రీడమ్ సంస్థ సభ్యుడు నరవ ప్రకాశరావు పిలుపునిచ్చారు. హిరోషిమా నగరంపై బాంబు దాడి ఘటనకు 78 ఏళ్ళ పూర్తయిన సందర్భంగా ఆదివారం బివి.ఫౌండేషన్, రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం చినగదిలి తహశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల గృహంలో హిరోషిమా సంస్మరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ప్రపంచంలో నివసించే ప్రతి ఒక్కరూ అణ్వస్త్ర రహిత సమాజం కోసం పనిచేయాలన్నారు. ప్రపంచ దేశాలు అణుశక్తిని శాంతియుత ప్రయోగాలకు వినియోగించాలి తప్ప వినాశనానికి కాదన్నారు. నేటి యువత మంచి భావాలను అలవర్చు కోవాలని సూచించారు. అనంతం బాలికలచే శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో హోం పర్యవేక్షణాధికారి ఎవి.సునీత, ఎల్వి.లక్ష్మి, మున్నేషా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-ఆనందపురం : పొడుగుపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు భూలోక మాత అమ్మవారు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు, కుంకుమలు, ధూప, దీప, నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు.



సంఘీభావం తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

11న చలో అడ్మిన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికులకు నిలిపేసిన రూ.2400 చెల్లించాలని కోరుతూ ఈ నెల 11న చలో అడ్మిన్ కార్యక్రమం చేపడుతున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం నిర్ణయించింది. ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జులై 13న ఇడి వర్క్స్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఉక్కు యాజమాన్యం హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు చెల్లింపునకు చర్యలు చేపట్టకపోతే వేలాదిమంది కార్మికులతో చలో అడ్మిన్ చేపడతామని హెచ్చరించారు. బోనస్, ఇస్ఐ, నోటీస్ పే వంటివి కూడా పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో నాయకులు నమ్మి రమణ, బొడ్డ గోవింద్, సోంబాబు, రామిరెడ్డి, సత్యారావు, కోన రమణ, ఉమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు



లక్ష్మిని సన్మానిస్తున్న మోహన్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి -గాజువాక : మహిళలు అని రంగాల్లోనూ రాణించాలని మోహన్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్ కోరారు. గాజువాకు చెందిన న్యాయవాది అండిబోయిన లక్ష్మి హైకోర్టు న్యాయవాదిగా, నేషనల్ పవర్ లిఫ్టింగ్‌కు ఎన్నికైన సందర్భంగా ఆదివారం ఉడా కాలనీ జంక్షన్‌లో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ, తమ స్కూల్లో చదివిన లక్ష్మి ఈ స్థాయికి ఎదగడం తమకు గర్వకారణమన్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదుగుతూ, ఎంతోమందికి సహాయ సహకారాలు అందిస్తూ సేవా రత్న అవార్డు పొందిన ఆమె ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.రామారావు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, గాజువాక నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉరుకుటి చందు, దల్లి గోవింద్, ఎజె.స్టాలిన్, సిఐటియు నాయకులు రామస్వామి, జైల్ సూపరింటెండెంట్ బి.వి.రమేష్‌కుమార్, ఆల్ ఇండియా సంఘమిత్ర స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ రుక్మాకర్, ఒబిసి ప్రెసిడెంట్ బి.అప్పారావు, శ్రీనివాస్, అండిబోయిన అప్పారావు, వేంపాడు అప్పారావు, దొడ్డి రమణ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా రాస్తారోకో

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : మణిపూర్‌లో హింసను వ్యతిరేకిస్తూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యాన ఆదివారం కొత్తగాజువాకలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించారు. వైసిపి క్రైస్తవ విభాగం నాయకుడు రవిబాబు మాట్లాడుతూ, మణిపూర్‌లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి భారతమాతపై జరిగినట్లు ప్రతి ఒక్కరూ పరిగణించాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ, మణిపూర్‌లో చర్చిలపై, క్రైస్తవుల ఆసుపత్రులు, పాఠశాలలు, ఆస్తులపై జరుగుతున్న ఉద్దేశపూరిత దాడులను అరికట్టాలని కోరారు.

కొవ్వొత్తులతో నిరసన

భీమునిపట్నం : మణిపూర్‌లో క్రైస్తవులు, చర్చిలపై జరుగుతున్న దాడులకు నిరసనగా స్థానిక యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి భీమిలిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతి నెలకొనాలని కోరుతూ స్థానిక జీసస్ పార్కు వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కెఎస్ఎం.సుధాకర్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనకు పాదయాత్ర

ప్రజాశక్తి -మూలగాడ : 'కొత్త పె(పె)న్షన్ వద్దు-పాత పెన్షన్ ముద్దు' అనే నినాదంతో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన రక్షణ రంగ కార్మికులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. శ్రీహరిపురంలోని కోరమాండల్ గేటు నుంచి నేవల్ బేస్ వరకూ చేపట్టిన పాదయాత్ర కార్మిక శక్తికి, ఉద్యమస్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ఉమ్మడి విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యువిఎస్ఎన్.వర్మ ఎర్రజెండా ఊపి ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఎన్‌సిఇ, ఎన్ఎడిసిఇ, ఎస్‌బిసిసిఇ, ఎంఇఎస్‌సిఇ, ఎన్ఎస్‌టిఎల్‌సిఇ, డిజిఎన్‌పిసిఇ తదితర యూనియన్లు పాదయాత్రకు భాగస్వామ్యం వహించాయి. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు పాదయాత్ర అనంతరం నేవల్ బేస్ వద్ద జరిగిన ముగింపు సభలో మాట్లాడారు. పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగుల హక్కు అని, దానిని సాధించేంతవరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. హెచ్ఆర్ఎపై ఒటి, అప్రెంటిస్‌లకు ఇంక్రిమెంట్లు విషయంలో తూర్పు కార్మికులు వివక్ష గురవుతున్నారని వివరించారు. ఆరేడు సంవత్సరాలైనా జీతాలకు సంబంధించిన ఎరియర్స్ రాలేదని, ఎప్పుడు వైద్య సౌకర్యాలు ఆగిపోతాయో తెలియని పరిస్థితి ఉందని, వీటిని వెంటనే పరిష్కరించాలని తూర్పు నౌకాదళ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే బేస్ గేట్ దగ్గరే రక్షణ రంగ కార్మిక కుటుంబాలతో వంటావార్పు చేపడతామని హెచ్చరించారు.

పాదయాత్రకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలోని పంచభూతాలను బిజెపి ప్రభుత్వం ఒడిసి పట్టిందని, మోడీ మిత్రులైన అంబానీకి దేశ పశ్చిమతీరాన్ని, అదానీకు తూర్పు తీరాన్ని దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు అమ్మడమే బిజెపి దేశభక్తి అని ఎద్దేవాచేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. సభలో ఏఐడిఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.గోపాలకృష్ణ, టిఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగార్జునరావు, డిఐటియూ రాష్ట్ర అధ్యక్షులు చింతా చిట్టిరాజు, ఐఎన్‌టియుసి విశాఖ జిల్లా కార్యదర్శి టి.సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.



పాదయాత్ర చేస్తున్న రక్షణ రంగ కార్మికులు

ఎన్‌సిఈయూనియన్ ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు, ఎన్ఎడిసిఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస రావు, ఎస్‌బిసిసిఇ యూనియన్ అధ్యక్షులు వర్మ, ప్రధాన కార్యదర్శి రతన్‌రాజు, ఎంఇఎస్‌సి యూనియన్ ప్రధాన కార్యదర్శి డీన్ అహ్మద్, ఎన్‌సి యూనియన్ అధ్యక్షులు మారుతి వరప్రసాద్, ఎన్ఎడిసిఇ యూనియన్ అధ్యక్షులు నూకరాజు, ఐఎన్‌సి కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కాకర వివిఎస్‌డి.కుమార్, అంజనీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'గంగవరం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పులి రమణారెడ్డి

ప్రజాశక్తి- గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల సంఘం నాయకులు పులి రమణారెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు ఆదివారం నాటికి 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను రమణారెడ్డి ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను విధులలో చేర్చుకోవాలని డిమాండ్‌చేశారు. సమస్య జటిలం కాకుండా పరిష్కరించాలని యాజమాన్యానికి సూచించారు. నిర్వాసిత నాయకులు గొందేశి సత్యారావు, వైసిపి నాయకులు గొందేసి మహేశ్వరరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు ముడసిరి శ్రీనివాసరావు, సుమన్‌రెడ్డి, బస అప్పలరెడ్డి, అప్పారావు, గోపి, అప్పలరాజు, తాతారావు, యళ్లాజీరావు, పోలారావు, బాలకృష్ణ, నూకరాజు, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడను ఉక్కు నగరం రైల్వే స్టేషన్‌గా మార్చాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఉక్కు నగరం రైల్వేస్టేషన్, లేదా వైజాగ్ స్టీల్‌స్టేషన్‌గా పేరు మార్చాలని కోరుతూ డిఆర్ఎమ్‌కు నివాస్ అధ్యక్షులు బి గుర్రప్ప, సభ్యులు కృష్ణారావు వినతి పత్రం అందించారు. రైళ్ల ఆగే సమయాన్ని ఐదు నిమిషాలకు పెంచాలని, అన్ని రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఒకటి నుంచి నాలుగుకు పెంచాలని, ప్లాట్‌ఫారం 1లో రెస్ట్‌రూమ్, డార్మెటరీ సదుపాయం కల్పించాలని, స్టేషన్‌కు ఇరువైపులా ఆటోలు ఉండేలా పార్కింగ్ సదుపాయం కల్పించాలని, స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్లు ఉండేలా చూడాలని కోరారు.

'బీసీల కులగుణన చేపట్టాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార: దేశవ్యాప్తంగా బీసీల కుల గణన వెంటనే చేపట్టాలని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన కోసూరి శ్రీనివాసరావుకు వెంకటేశ్వరరావు నియామకపత్రం అందజేశారు. సంఘాభివృద్ధికి కృషిచెయ్యాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గూడూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ,. బీసీ గణన చేపట్టాలని 240 బీసీ కమిషన్లు సిఫారసు చేసినా కేంద్రప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి పంపినా కేంద్ర ప్రభుత్వం స్పందించపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పెట్నేలి రవికుమార్ మాట్లాడుతూ, బీసీలకు నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సత్యలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీ మహిళ హక్కులు సాధనకు కృషిచేస్తున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కోసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బీసీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ఈ సమావేశంలో సౌత్ ఇండియా కన్వీనర్ ఆర్.కృష్ణవేణి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కోరుబిల్లి ఊర్వశి, జోనల్ మహిళా కన్వీనర్ వెంకటలక్ష్మి, జోనల్ అధ్యక్షుడు అప్పలరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు, బి పద్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావుకు నియామకపత్రాన్ని అందిస్తున్న వెంకటేశ్వరరావు



ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకుంటున్న కీర్తి

51వ వార్డులో ఓటర్ల పరిశీలన

ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 51వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు సనపల కీర్తి ఆధ్వర్యాన మాధవధార ఉడా కాలనీ తదితర ప్రాంతాల్లో ఓటర్ పరిశీలన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సనపల కీర్తి మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు జయరాజ్, పేడాడ మధుసూదనరావు, మూల అప్పారావు, బొడ్డేపల్లి లలిత, బివిఎలులు తదితరులు పాల్గొన్నారు.

వినోదాల విందు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన వినోదాల విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కిట్స్ ప్రేక్షకులను అలరించాయి. తాగుబోతు రమేష్, పెళ్ళాం ఊరెళితే, ఇంట్లోకి రండి, కండక్టర్ గాడు పెళ్ళాం, డాక్టర్ సూరి ప్రదర్శనలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. అనంతరం ఫ్రెండ్స్ కామిక్ క్లబ్ వ్యవస్థాపకులు ఎంవి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రతి నెలలో మొదటి ఆదివారం వినోదాల విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్య నటులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ ఆలయానికి తాగునీరు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేటలోని యాదవుల ఆరాధ్య దైవం రాధాకృష్ణ ఆలయానికి స్థానిక వైసిపి కార్పొరేటర్ సారిపల్లి గోవిందు తాగునీటి కుళాయి ఏర్పాటుచేశారు. ముందుగా రాధాకృష్ణ ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, అప్పారావు, వాసు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలివ్వాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము




నూనత అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, నాయుడు



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

ప్రజాశక్తి-అనకాపల్లి

పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 70 శాతం ఉద్యోగాలు కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక భవన్‌లో ఆదివారం జరిగిన డివైఎఫ్ఐ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు స్థానిక పరిశ్రమల్లో 70 శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ నీటిమూటగానే మిగిలిపోయిందన్నారు. జిల్లాలో ఎస్ఇజెడ్, ఫార్మా, ఇతర కంపెనీల్లో నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి కల్పించడంలేదన్నారు. కల్పించిన ఉపాధి కూడా అత్యంత దయనీయమైన తక్కువ జీతాలు వచ్చే వాచ్‌మన్లు, తోటమాలి వంటి పనులు ఇస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతియేటా ఇయర్ క్యాలెండర్ వేసి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులకు వైసిపి ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. ప్రభుత్వ శాఖలు, గ్రామ, వార్డు సచివాలయాల ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ప్రతీయేటా డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన హామీ కూడా నెరవేరలేదని గుర్తు చేశారు. వెంటనే పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం డివైఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. 12 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్.శివాజీ, ఎస్‌వి.నాయుడు, ఉపాధ్యక్షులుగా అల్లు రాజు, సహాయ కార్యదర్శులుగా ఎన్.నారాయణరావు, శివ ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

హింసపై పోరాటాలు ఉధృతం

ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

ప్రజాశక్తి-రాంబిల్లి

దేశంలో మహిళలపై జరుగుతున్న హింస, దాడులు, హత్యలు, అత్యాచారాలపై పోరాటాలను ఉధృతం చేస్తామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం అన్నారు. మండలంలో రాంబిల్లి, పెదకళవలాపల్లి గ్రామాలలో ఆదివావారం హింసపై మహిళల పోరుయాత్ర కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపోరు యాత్ర జూలై 28 నుండి ఆగస్టు 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ చిన్నారులు, మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరుగుతుందని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇది మరింత పెరిగిందని విమర్శించారు. ప్రభుత్వాలు మహిళలు పట్ల నిర్లక్ష్యధోరణితో ఉన్నాయన్నారు. మహిళా మల్ల యోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన తడి ఆరకముందే మణిపూర్‌లో కుకీ ఆడపడుచులపై అకృత్యాలు జరిగాయని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం మహిళల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తుందన్నారు. పోరుయాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 8న విజయవాడలో జింఖానా గ్రౌండ్స్‌లో జరుగు బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల నాయకులు జి.లక్ష్మి, ఎం.దేవి, రాజేశ్వరి, మాకరత్నం, పార్వతి పాల్గొన్నారు.



సాగునీరు విడుదల చేస్తున్న వైసిపి నాయకులు దాడి రత్నాకర్

శారదా నది గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : శారదా నదిపై నిర్మించిన గ్రోయిన్లు శిథిల స్థితికి చేరి వర్షం నీరు సముద్రంలో కలుస్తున్న నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తగరంపూడి గ్రోయన్ వద్ద గేట్లను ఎత్తి పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. మరమ్మతులకు గురైన గ్రోయిన్లను రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తన సొంత నిధులతో గేట్లను బాగు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు పంట సీజన్ మొదలైన సందర్భంగా రైతుల అవసరార్థం పంట పొలాలకు గేట్లను ఎత్తి శారదా నది నీటిని విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు దాడి రత్నాకర్‌ను ఘనంగా శాలువాతో సత్కరించారు. కాశీ బాబు, పాకలపాటి సురేష్ బాబు, రవిరాజ్, పాకలపాటి రాజబాబు, బొడ్డపాటి చినరాజారావు, నందవరపు కుమార్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవితాంతం ఆరోగ్య మిత్రులుగా ఉండాలంటే యోగాను అలవర్చుకోవాలని యోగ సమితి భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. జార్జి క్లబ్‌లో ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఆదివారం యోగ సాధకులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మన బంధం ఆరోగ్యం పెంపొందించుకునే స్నేహబంధమన్నారు. యోగా గురువు మాదేటి జనార్ధన్, కొణతాల పెద్ద, బిఎస్ఎంకె జోగి నాయుడు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, మల్ల నరసింగరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి అభివృద్ధికి కృషి



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, జెడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి అన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా ఆదివారం అనకాపల్లి రైల్వే స్టేషన్ పనులను ప్రధాని మోడీ, రైల్వే మంత్రి వైష్ణవతో కలిసి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఎంపీతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లేపల్లి సుభద్ర, కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, రైల్వే అధికారులు తిలకించారు. అనంతరం ఎంపీ సత్యవతి మాట్లాడుతూ తాను ఎంపీగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, బొజ్జన్న కొండ, కేంద్రీయ విశ్వ విద్యాలయానికి నిధులు తెచ్చినట్టు తెలిపారు. అమృత్ భారత్‌లో భాగంగా అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ఫుడ్ కోర్టులు, పార్కులు అభివద్ధి చేసి పర్యాటక హంగులతో పాటు వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్‌లో భాగంగా ఏటికొప్పాక బొమ్మల విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, ఎమ్మెల్సీ రఘువర్మ, సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ అధికారి శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, డాక్టర్ కే విష్ణు మూర్తి, రైల్వే సలహా మండలి సభ్యులు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను అణగదొక్కేందుకే సెక్షన్ 30

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రజాసమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాల గొంతులను అణగదొక్కాలని చూస్తున్నారని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. గవరపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు రోడ్డు షోలకు, నారా లోకేష్ యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఇటువంటి చర్యలకు పూనుకుంటుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గూండాలు, రౌడీలతో ఆంధ్ర రాష్ట్రాన్ని మణిపూర్‌లా మారుస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియజకవర్గ పరిశీలకులు బొర్రా నాగ రాజు, నాయకులు మళ్ళ సురేంద్ర, మాధంశెట్టి నీలబాబు, బిఎస్ఎంకె జోగినాయుడు, పోలారపు త్రినాథ్, పచ్చికూర రాము, సిరసపల్లి సన్యాసిరావు, కొణతాల రత్న కుమారి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కొణతాల శ్రీనివాసరావు, సబ్బవరపు గణేష్, ఆళ్ళ రామచంద్ర రావు, సేనాపతి స్వరూప, కాండ్రేగుల సతీష్‌కుమార్, పల్లెల నాగేశ్వర రావు, పిట్లా రాజు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యాన అంతర్జాతీయ స్నేహ మాసోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఎన్‌ఆర్‌టి వంద పడకల ఆసుపత్రిలో రోగులకు పళ్ళు, రొట్టెలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షులు పెంటకోట నరసింగరావు, చైర్మన్ పిఎస్ అప్పారావు, అధ్యక్షులు బిఎస్ఎంకె జోగి నాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బుద్ధ శివ, పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం

రానున్న ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి, పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బండారు సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇకపై నెలకు రెండుసార్లు వార్డు, క్లస్టర్, మండల, నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయడంలో ఆయా బూత్ స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ వైసీపీ ప్రభుత్వం జీవో ఇవ్వడంతో గ్రామాల్లో పేదల భూములను ఎవరైనా బెదిరించి లాక్కునే ప్రయత్నం చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రావెల్, మట్టి తవ్వకాలు వైసీపీ నేతలు పెచ్చుమీరి చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ పరిశీలకులు గంటా నూకరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బండారు అప్పల నాయుడు, గండి రవి కుమార్, గండి ముత్యాల నాయుడు, కోటాన అప్పారావు, పైల జగన్నాధరావు, కరక దేముడు, రేసుపూడి రమణ, దొడ్డి సూర్యప్రకాష్, గవర అప్పారావు, డి. ప్రసాదరావు, గొర్లి చైతన్య, దాడి కన్నం నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ముఖం చాటేసిన వరుణుడు

- చుక్క నీరు లేని చెరువులు
- నాట్లకు సిద్ధంగా ఉన్న వరి నారు
- ఆందోళనలో రైతులు



ఏపుగా ఎదిగి నాట్లుకు సిద్ధంగా ఉన్న వరి నారు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

అడపా దడపా చినుకులే తప్ప భారీ స్థాయిలో వర్షాలు కురవకపోవడం, చెరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో వరి సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి, చెరకును అధికంగా పండిస్తూ ఉంటారు. ఖరీఫ్ సీజన్లో భాగంగా రైతులు నెల రోజుల క్రితం వరి నారు వేశారు. ఇప్పుడు అది ఎదిగి నాట్లుకు సిద్ధమైంది. వరి నారులు ఏపుగా పెరిగి ఉన్నాయి. గత వారం రోజుల నుండి వరుణుడు కాస్త ముఖం సాటేశాడు. అంతకుముందు కురిసిన వర్షాలు సాధారణ వర్షాలు మాత్రమే. మండలంలోని ఏ గ్రామంలోనూ చెరువుల్లో చుక్క నీరు కూడా చేరలేదు. వారం రోజుల క్రితం వాతావరణం చల్లగా ఉండడంతోపాటు చిరుజల్లులు కురుస్తుండడంతో ఖరీఫ్ వరి సాగుకు రైతులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అయితే ఈ వారం రోజులుగా వరుణిడి జాడ లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

మండలంలోని కోనాం రిజర్వాయర్ నుండి సాగునీరు అవకాశం ఉన్న విజయరామరాజుపేట, మంగళాపురం, పెద్దేరు రిజర్వాయర్ నుండి నీరు అవకాశం ఉన్న చిన్నప్పన్నపాలెం, వడ్డాది, పోలేపల్లి తదితర సాగునీటి అవకాశం ఉన్న గ్రామాల్లో అడపా దడప వరి నట్లు ప్రారంభమయ్యాయి. మిగతా గ్రామాలన్నీ ఖరీఫ్ వరి సాగు పూర్తిగా వర్షాధారమే. వర్షం కురిస్తే వరి నాట్లు జరుగుతాయి, లేదంటే లేదు. వర్షాలు సహకరిస్తే మండలంలో సుమారు 6వేల ఎకరాలకు పైగా ఖరీఫ్ వరిసాగు జరుగుతంది. గత కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరి సాగు ఎలా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

ఉత్సాహంగా నాన్ షెడ్యూల్ ఆదివాసీల పాదయాత్ర



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీ, పెదనాయుడుపాలెం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సబ్బవరం-3 సచివాలయ భవనాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆదివారం ప్రారంభించారు. సబ్బవరం రోడ్డు నుండి గోగాడ అప్పలనాయుడు ఇంటి వరకు 10 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసకపల్లి- లంకెలపాలెం రోడ్డుకు రెండు కోట్ల 20 లక్షలు, సబ్బవరం- అంతకపల్లి రోడ్డుకు రూ.90 లక్షలు, పాత రోడ్డు నుండి గుల్లెపల్లి వరకు 60 అడుగులు వెడల్పు రోడ్డుకు రూ.9 కోట్ల 80 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవిందా, ఎంపీడీవో రమేష్ నాయుడు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు ముత్యాలయుడు, పాలిశెట్టి సురేష్ రాజ్, కర్రి బాబు, సర్పంచ్ డి.ప్రసాదరావు, సబ్బవరపు నాగభూషణం, సబ్బవరపు బుజ్జి పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీకి సిద్ధం


ప్రజాశక్తి-కశింకోట : ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 12,394 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు వైద్య అధికారి యశోద తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ ఆరోగ్య కేంద్రం పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో ఒకటి నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 3,405 మంది, ఆరు నుండి 19 సంవత్సరాల లోపు పాఠశాల, కళాశాల విద్యార్థులు 8,989 మంది, మొత్తం 12,394 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ 10వ తేదీన ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది సమన్వయంతో మాత్రలు మింగించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అమృత్ భారత్ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమృత్ భారత్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పేర్లతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేశంలో నిరుద్యోగులు పెరగడం, వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతినడం, ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల వంటి సమస్యలు కేంద్ర బిజెపి ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. భారతదేశ ప్రజలు ఇన్ని ఇబ్బందుల్లో ఉంటే ప్రజాధనాన్ని రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ అంత అవసరమా అని ప్రశ్నించారు. ఆ డబ్బును విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మీద ఖర్చు పెడితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని రైళ్లలో జనరల్ బోగీలు పెంచుతూ వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ప్రత్యేక బోగీలు ఏర్పాటు చేయాలని కోరారు.

'వారాహి'ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 10వ తేదీన విశాఖలో చేపట్టిన వారాహి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల జనసేన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో మండల వారీగా బస్సు సదుపాయం ఉంటుందని, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశు రాం, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విజయ్‌కుమార్, జనసేన నాయకులు

ఐటిడిఎ సేవలు మైదాన గిరిజనులకు వర్తింపజేయాలని డిమాండ్

ప్రజాశక్తి- వడ్డాది, చోడవరం

జిల్లాలోని నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనుల సమస్యలపై 5వ షెడ్యూల్ సాధన సమితి, అఖిలభారత ఆదివాసీ సంఘం ఆధ్వర్యాన ఈ నెల 4 నర్సీపట్నంలో ప్రారంభమైన పాదయాత్ర ఉత్సాహకంగా సాగుతోంది. మూడో రోజు పాదయాత్ర ఆదివారం ఉదయం వడ్డాది నుండి ప్రారంభమై చోడవరం మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నల్లి కళ్యాణం మాట్లాడుతూ ఐటిడిఎను అల్లూరి జిల్లాలో కలిపి వేయడంతో అనకాపల్లి జిల్లాలోని నాన్ షెడ్యూల్ ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జిల్లాలోని ఆదివాసీల భూములను కాజేయడానికి అవినీతిపరులైన కొందరు రెవెన్యూ అధికారుల సహకారం, కొందరు పోలీసు అధికారుల మద్దతుతో పెద్ద ఎత్తున ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. ఎపి వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు, ఎంపీ రాందేవ్ మాట్లాడుతూ ఐటీడీఏ ఏర్పడినప్పుడు బైలాలో రాసిన భౌగోళిక ప్రాంతం మారలేదని, అందువల్ల అనకాపల్లి జిల్లాలోని మైదాన గిరిజనులకు ఐటీడీఏ సేవలు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ ఆదివాసీల భూమి సమస్యలపై బాధిత గిరిజనులు, స్థానిక అధికారులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి సమీక్ష సమావేశాలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బుగతా జంగారావు, ఎస్.గణేష్, లోకం భాస్కరరావు, వాకపల్లి రాజబాబు, గోరా దేవి, మోసూరి రాజు, చిన్నారావు, కోట కొండలరావు, గోరా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు, గిరిజనులు

పోరాడి డస్ట్ అలవెన్స్ సాధించుకున్న
ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికులకు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి - పరవాడ

ఈ నెల 3, 4 తేదీల్లో సమ్మె చేసి, పోరాడి డస్ట్ అలవెన్స్ సాధించుకున్న సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు సిఐటియు అభినందనలు తెలిపింది. ఈ మేరకు ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండు సంవత్సరాలుగా అగ్రిమెంట్ చేయకుండా నిర్లక్ష్యంగా, మొండిగా వ్యవహరించిన యాజమాన్యంపై కార్మిక వర్గం ఒక్కసారిగా తిరుగుబాటు చేసి సమ్మె విజయవంతం చేశారని పేర్కొన్నారు. కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితే విజయం సాధించగలమని ఎన్టిపిసి కాంట్రాక్ట్ కార్మికులు నిరూపించారని పేర్కొన్నారు. అయితే అగ్రిమెంట్ మూడు సంవత్సరాల కాలం రూ.2500 చేయడం, ఏరియల్ చెల్లించకపోవడం కార్మిక వర్గాన్ని మరోసారి వంచించడమే అవుతుందని తెలిపారు. కార్మికుల, అంగీకారం లేకుండా తెలుసుకోకుండా ఒప్పందం చేశారని, దీనివల్ల ప్రతి కార్మికుడు రూ.21,600 నష్టపోయారని వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఒకే రకమైన శాశ్వతమైన గేట్ పాస్ ఎన్టిపిసి లోగోతో ఇవ్వాలని, మెడికల్ టెస్ట్ పేరుతో కార్మికులను విధుల నుండి తొలగించడం, వేధింపులు గురి చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఫైనల్ సెటిల్మెంట్లు చేయకపోవడం సరికాదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఎన్టిపిసిలో కాంట్రాక్ట్ కార్మికులంతా ఐక్యంగా నిలబడాలని, సిఐటియు అండగా నిలుస్తుందని గనిశెట్టి తెలిపారు.



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో ఆదివారం వైయస్సార్ సంపూర్ణ పోషకాహారం కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బలిజ మంగ మునసిల నాయుడు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఈ పోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వంశీ ప్రియా, అంగన్వాడీ కార్యకర్త సేనాపతి నాగమణి పాల్గొన్నారు.

దూర ప్రాంత రైళ్లకు అనకాపల్లిలో హాల్ట్ కల్పించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : కేంద్ర రైల్వే శాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడానికి ఎంపిక చేయడం హర్షణీయమని, అయితే నూతన జిల్లాగా ఏర్పడిన అనకాపల్లి రైల్వే స్టేషన్లో దూరప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలుపుదల చేయాలని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు లేఖ ద్వారా డిఆర్‌ఎంను డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి ప్రయాణికులు వేలాదిమంది దూరప్రాంతాలకు అనకాపల్లి స్టేషన్ నుండి ప్రయాణం చేస్తున్నారని, దీని మూలంగా ప్రతిరోజు రైల్వే శాఖకు రూ.6 లక్షల పైబడి రాబడి వస్తుందని తెలిపారు. ఇక్కడ ముఖ్యమైన రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దీని మూలంగా దువ్వాడ విశాఖపట్నం వెళ్లి ఎక్కవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌లో శానిటేషన్ సిబ్బంది కొరత ఉందని, తగిన సిబ్బంది నియమించాలని, ప్రముఖ ట్రైన్లను అనకాపల్లి ఆగే విధంగా కృషి చేయాలని రైల్వే డిఆర్‌ఎంను వెంకటరావు కోరారు.

పాఠశాల పక్కన దుర్గంధం

తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలో వెంకన్నపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను దుర్గంధం వెంటాడుతుంది. గ్రామంలోని మురుగునీరు పాఠశాలను ఆనుకొని ఉన్న డ్రైనేజీ వద్ద నిలిచిపోయింది. దీంతో స్కూలు కిటికీ దగ్గర విపరీతమైన చెడువాసన వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. దోమలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో గ్రామంలో అనేక చోట్ల చెత్తాచెదారం పోగులు కనిపిస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే స్కూలు దగ్గర ఉన్న మురుగు కాలవను క్లీన్ చేసి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



పాఠశాల గోడ పక్కనే కాలువలో నిల్వ ఉన్న మురుగునీరు

ముకుందపురంలో 18 అడుగుల గిరినాగు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ పంచాయతీ శివారు ముకుందపురం గ్రామంలోని పంట పొలాల్లో ఆదివారం ఉదయం 18 అడుగుల గిరి నాగు కంటపడింది. భయంకరమైన గిరినాగు కనిపించడంతో గ్రామస్తులు హడలెత్తిపోయారు. వెంటనే ఈ సమాచారాన్ని స్థానిక అటవీశాఖ అధికారి శివకుమార్‌కు తెలియజేశారు. ఆయన వన్యప్రాణుల సంరక్షణ టీం సభ్యులకు ఫోన్ చేసి రప్పించారు. గిరినాగును పట్టుకునేందుకు టీం సభ్యులు చాలా అవస్థలు పడ్డారు. గిరినాగును పట్టుకునే సమయంలో పాము మరింత బుసలు కొట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. సుమారు 13 కేజీలు బరువు ఉన్న ఈ పామును చివరికి పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



పామును పట్టుకుంటున్న వన్యప్రాణుల సంరక్షణ టీమ్ సభ్యులు

'మహాశక్తి'తో మహిళలకు మేలు

ప్రజాశక్తి- అనకాపల్లి : టిడిపి అధికారంలోకి వస్తే అధినేత చంద్రబాబు ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళలకు మేలు జరుగుతుందని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, అర్బన్ జిల్లా కార్యదర్శి శంకర్ల పద్మలత, జిల్లా ఉపాధ్యక్షులు కాయల ప్రసన్న లక్ష్మి అన్నారు. జివిఎంసి 83వ వార్డు భీమునిగుమ్మం, అరుంధతి నగర్ ప్రాంతాల్లో ఆదివారం తెలుగు మహిళ నాయకులు ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకం గురించి వివరించారు. రాష్ట్రంలో మహిళలందరూ చంద్రబాబు నాయుడు పాలన కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల రామచంద్రరావు, పొలిమేర ఆనంద్, పచ్చికూర రాము, బెల్లాన శ్రీనివాసరావు, తెలుగు మహిళ నాయకులు భీశెట్టి హేమా, కురాకుల భారతి, వేదుల సూర్య ప్రభ, బత్తుల లక్ష్మి, కోట్ని ఉమ, తులసి, సత్యవతి, కుక్కల సత్యవతి పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని రొంగలివాని పాలెం, కుంచంగి రైతు భరోసా కేంద్రాల వద్ద మీనామృతం తయారు చేయడం పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం సుందరయ్య పేట యూనిట్ ఇన్చార్జ్ కరణం వెంకటరావు మాట్లాడుతూ మీనామృతం పట్ల ప్రతి ఒక్క రైతు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మీనామృతం పంటల ఎదుగుదలకు పోషకాలు అందించడంతో పాటు చీడపీడల నివారణ కొరకు ఉపయోగపడుతుందని చెప్పారు. మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వ దేవాలయాలకు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి నాగేశ్వరరావు, కొంచంగి గ్రామ సంఘ ఓబి పోలిన వరహా వెంకటలక్ష్మి, ఎల్ వన్ ఎం సత్యారావు, ఐసిఆర్‌పిలు కె కుమారి, వీరవతి, హేమలత పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తయినా నిరుపయోగం!

- హాస్టల్ భవనం ప్రారంభించడంలో అలసత్వం
- బిల్లులు చెల్లించక విద్యుత్ పనులు చేపట్టని కాంట్రాక్టర్
- మూడేళ్లుగా హైస్కూల్ విద్యార్థినుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని జె.నాయుడుపాలెం గ్రామంలో బాలికల హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయి మూడేళ్లు కావస్తోంది. మండలంలో కస్తూర్బా పాఠశాల ఒక్కటి బాలికల కోసం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 800 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వారికి ప్రత్యేక హాస్టళ్లు లేక దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అలాగే జె.నాయుడుపాలేనికి ఆనుకొని 16 గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల నుండి బాలికలు రావాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు సౌకర్యం కూడా లేదు. గత ప్రభుత్వం వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని బాలికల హాస్టల్‌కు భవనం నిర్మించింది. ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ భవనాన్ని పరిశీలించి ఎలక్ట్రికల్ పనులు పూర్తికాకపోవడంతో ప్రారంభించలేదన్నారు. అయితే వాస్తవానికి కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోవడం వల్ల ఎలక్ట్రికల్ వర్కు అవలేదని గ్రామస్తులు అంటున్నారు. దీని యొక్క పూర్వపరాలు తెలుసుకొని ఈ ప్రాంతంలో చదువుకుంటున్న బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న వసతి గృహం

బాలికలు బడి మానేస్తున్నా పట్టదా?



జె.నాయుడుపాలెం గ్రామాన్ని ఆనుకొని రెండు పంచాయతీలు, ఆరు శివారు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఆడపిల్లలు 7వ తరగతి చదివి, సరైన అవకాశాలు లేక, దూర ప్రాంతాలకు వెళ్లాలంటే తల్లిదండ్రులు సహకరించక బడి మానేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు తలచుకుంటే హాస్టల్ విద్యుత్ పనులు చేయించలేరా?

వెంకట నరేష్, ఎంపిటిసి

హాస్టల్ భవనం ప్రారంభించాలి



హాస్టల్ భవనం పూర్తయి మూడేళ్లు కావస్తున్నా ప్రారంభించక నిరుపయోగంగా వదిలేశారు. జిల్లా అధికారులు గ్రామానికి వచ్చి చూశారు. బాలికలు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వసతి గృహాన్ని ప్రారంభించాలి.

ఈరెల్లి చిరంజీవి

31వ రోజుకు అణుకు గిరిజనుల దీక్ష



దీక్షల్లో పాల్గొన్న గిరిజనులు

ప్రజాశక్తి కోటవురట్ల: రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని అణుకు గిరిజనులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 31వ రోజుకు చేరుకున్నాయి, ఈ సందర్భంగా గిరిజనులు తమ న్యాయమైన కోరికలు తీర్చాలని నినాదాలు చేశారు. కార్యక్రమములో సిపిఎం నాయకులు డేవిడ్ రాజు పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

చుండూరు మృతులకు నివాళి


నివాళులర్పిస్తున్న కృష్ణ స్వరూప్

ప్రజాశక్తి -పాయకరావుపేట : స్థానిక పరివర్తన నిలయంలో చుండూరు దళిత మృతవీరుల చిత్రపటాలకు ఆదివారం దళిత బహుజన పార్టీ వ్యవస్థాపకులు వడ్లమూరి కృష్ణస్వరూప్ పూలమాలలు వేసి కన్నీటి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, 1991లో చుండూరులో దళితులపై జరిగిన మారణకాండలో 11 మంది మృతి చెందారన్నారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు..ఈ ఘటనలో నిందితులపై కేసులు కొట్టేయడంతో బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు దువ్వాడ దావీదు. నాయకులు జెక్కల సూరిబాబు, చిరుకూరి రమణబాబు, చిరుకూరి అర్జునరావు. మాలమహానాడు అసెంబ్లీ ఇన్‌ఛార్జి మార్త సింహాచలం పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వేకు స్పెషల్ డ్రైవ్


బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి -నక్కపల్లి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బిఎల్ఒలు ఆదివారం మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద బిఎల్ఒలు అన్ని పత్రాలతో హాజరై ఓటర్ల జాబితాసర్వేతో పాటు కొత్త ఓటర్ల నమోదు, సవరణ చేపట్టారు. తహసిల్దార్ అంబేద్కర్ పెద్దతీనార్ల, చిన తీనార్ల, జానకయ్య పేట, రాజయ్యపేట, ఉపమాక తదితర గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఓటరు సర్వేను తీరును పరిశీలించారు. బిఎల్ఒలు ఇంటింటినీ సందర్శించి, ఓటరు జాబితా ఆధారంగా ఓటర్ల పేరు, డోర్ నెంబర్, వయస్సు , పుట్టిన తేదీ, చిరునామా పక్కాగా సరి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిటి తాతాచార్యులు పాల్గొన్నారు

వాళ్లు పెంచారు... వీళ్లు తుంచారు..!

ప్రభుత్వ నిధులతో మొక్కలు పెంచినా ప్రయోజనం శూన్యం

విద్యుత్‌శాఖ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు


బికె.పల్లి రోడ్డులో పెంచిన మొక్కలు (నాడు)


.. విద్యుత్ సిబ్బంది కొట్టేసిన చెట్లు (నేడు)

ప్రజాశక్తి- కోటవురట్ల : పర్యావరణ పరిరక్షణకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులతో బికె.పల్లి గ్రామంలో ఆహ్లాదకరంగా పెంచిన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను విద్యుత్తు లైనుకు అడ్డంకిగా ఉన్నాయని సంబంధిత శాఖ సిబ్బంది ఇష్టానుసారంగా నరికేయడంపై గ్రామస్తులు సహా పర్యావరణ ప్రేమికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఉపాధి నిధులు రూ.లక్షలు ఖర్చు చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచిన మొక్కలు, ఇలా అభ్యంతరరంగా నరికి వేయడం తగదని పలువురు అంటున్నారు.

మొక్కలను పెంచి, వాటిని సంరక్షించాలని ఒకవైపు ప్రభుత్వం అధికారులు అంటుంటే, ఇలా నరికేసి నాశనం చేయడం వల్ల ఏం ప్రయోజనమని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో ఉపాధి నిధులతో ఈ మొక్కల పెంపకం చేపట్టి, లక్షల్లో నిధులు ఖర్చు చేశారని, దీని వల్ల రెండువిధాలుగా నష్టం జరిగినట్లేనని వాపోతున్నారు. ఇటువంటి కొన్ని ప్రాంతాల్లోనైనా రోడ్డు పక్కల్లో ఉన్న మొక్కల సంరక్షణకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కేబుల్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, లేకంఉటే పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం అంటూ మొక్కలను పెంచినా ప్రయోజనం ఉండదని పలువురు అంటున్నారు.

పోటెత్తిన పర్యాటకులు

ఆదివారం సెలవు కావడంతో భారీగా సందర్శకులు


డముకు వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -అనంతగిరి :మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో సందర్శకుల తాకిడి నెలకొంది. నెల రోజులుగా వెలవెలబోయిన బొర్రాగుహలు, కటికి, తాడిగుడ, చిటంపాడు జలపాతాలు, అలాగే డముకు వ్యూపాయింట్, అనంతగిరి కాఫీ తోటలు, చాపరాయి ఆదివారం సెలవు దినం కావడంతో విదేశీ పర్యాటకులతోపాటు జిల్లాలోనూ, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది సందర్శకులతో కిటకిటలాడాయి. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జలపాతాల్లో జలకళ సంతరించుకోగా, పిల్లలు, యువత కేరింతలు కొడుతూ, సెల్ఫీలతో సందడి చేశారు. బొర్రాగుహల సందర్శన తర్వాత కాఫీ ప్లాంటేషన్, సుంకరమెట్ట వ్యూపాయింట్ మీదుగా అరకు. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, డుంబ్రిగుడ చాపరాయి ఇలా పర్యాటక ప్రాంతాల్లో జనసందడి నెలకొంది.

పాఠశాల ప్రాంగణంలో రోడ్డు నిర్మాణ సామగ్రి

- ఏడాదిగా నిర్లక్ష్యంగా వదిలేసిన కాంట్రాక్టర్
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో బిబి.పట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన రాతిపిక్క వేయడంతో సంవత్సర కాలంగా విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంకె.పట్నం నుండి బిబి.పట్నం మీదుగా రత్నంపేట వెళ్లే రహదారి పనులు ప్రారంభించే ముందు హైస్కూల్ ప్రాంగణంలో ఇసుక, బేబీ చిప్స్ వేయించారు. నెలలు గడుస్తున్నా ఆ రహదారి పనులు చేపట్టలేదు. అయితే హైస్కూల్ ప్రాంగణంలో వేయడం వల్ల విద్యార్థులకు ఆటలకు ఆటంకంగా ఉంది. మరోవైపు పాఠశాలకు సంబంధించి రెండవ విడత నాడు నేడు పనులు జరుగుతున్నాయి గ్రౌండ్ మొత్తం ఎకరా వైశ్యాలంతో రోడ్డు నిర్మాణం కోసం వేసిన మెటీరియల్ అడ్డంగా ఉంది. అధికారులు స్పందించి మెటీరియల్ తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పాఠశాల ప్రాంగణంలో కప్పేసినట్లున్న చిప్స్ కుప్పలు

విప్లవ గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

- సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - యంత్రాంగం

అనకాపల్లి : ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. బడుగు, బలహీనవర్గాలను చైతన్య పర్చడానికి తన కళలతో కృషి చేశారని కొనియాడింది. ఆయన పాట ఎప్పుడూ సామాజిక సమస్యలపై, ఉద్యమాలపై ఉగ్రూతలూగించేలా వుండేదని, జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని పేర్కొంది. సామాజిక మార్పు కోసం తపన పడ్డారని, ఇందుకోసం నిర్బంధాన్ని సైతం అనుభవించారని తెలిపింది. ఆయన మృతి అభ్యుదయ సాహిత్య లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసింది.

నక్కపల్లి : విప్లవ కవి, గాయకులు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం గద్దర్ మృతి చెందడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్ మరణానికి సంతాపం వ్యక్తం చేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. .గద్దర్ అంటేనే విప్లవం, విప్లవం అంటేనే గద్దర్ అని ఆయన మరణం ప్రజాస్వామిక వాదులకు తీరనిలోటని అన్నారు. .ఆయన పాటలు ద్వారా ఎంతో మంది ఉత్తేజితులై వామ పక్ష ఉద్యమాలలోకి వచ్చారన్నారు..

దేవరాపల్లి : గద్దర్ మృతి పట్ల బహుజన కళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రజా గాయకుడు కాటపల్లి అప్పారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రజా వాగ్గేయ కారులుగా తెలుగు నేల ఆయనను మరువదన్నారు. చరిత్రలో ఆయన కళా సేవలు మరువలేనివని పేర్కొన్నారు. నక్సల్స్ ఉద్యమం లోనూ, పౌరహక్కులు, దళితులు ఉద్యమంలోనూ, తెలంగాణ ఉద్యమంలోనూ గద్దర్ పాత్ర మరువలేని దన్నారు. ఉద్యమాలలో ఎన్నో ఆటుపోట్లు, ఎత్తు పల్లాలు, గెలుపోటములకు ఆయన ప్రత్యక్ష సాక్షి అని పేర్కొన్నారు.

ఉక్కునగరం : విశ్రమించిన విప్లవ శంఖం ప్రజా గాయకుడు గద్దర్ అని సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో గద్దర్ సేవలు మరువలేమని గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు వైటిదాస్, కె సత్యనారాయణ, స్టీల్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

మాధవధార : ప్రజా యుద్ధ నౌక మూగబోయిందని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు పేర్కొన్నారు. కోట్లాది మంది పేదల కష్టనష్టాలను పాటలు రూపంలో వినిపించిన మహనీయుడు గద్దర్ అని, ఆయన అకాల మరణానికి చింతిస్తూ, ఆ కుటుంబాని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జల్లూరు, పందూరు వంతెనల

కథ కంచికేనా.!



ఐదేళ్లు దాటినా ఇంకా పిల్లర్ల స్థాయిలోనే పందూరు వంతెన

- అప్రోచ్ రోడ్డు లేక వినియోగానికి దూరంగా జల్లూరు వంతెన
- ఐదేళ్ల వుతున్నా పునాదుల స్థాయిని దాటని పందూరు వంతెన
- అవస్థలు పడుతున్న ప్రజలు ...పట్టని అధికారులు, నేతలు

ప్రజాశక్తి- కోటవురట్ల : వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు గడిచినా జల్లూరు, పందూరు వంతెన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దిష్టిబొమ్మల్లా వెక్కిరిస్తూ దర్శనమిస్తున్నాయి, గత ప్రభుత్వంలో జల్లూరు వంతెన బలహీనంగా ఉందని భారీ వాహనాలకు ప్రవేశం లేదని సుమారు రూ.60 లక్షలకు వచ్చి డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అనంతరం రూ. ఐదు కోట్లతో బ్రిడ్జి నిర్మాణం దాదాపు పూర్తయిన సమయంలో, వంతెనకు అప్రోచ్ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం మేనమేషాలు లెక్కిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణికులు ప్రధానంగా విద్యార్థులు నిత్యం శిథిలావస్థకు చేరుకున్న వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం ఉంచుకోవాలని



జల్లూరు పాత వంతెన పైనుంచి ప్రయాణిస్తున్న వాహనాలు

విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా పందూరు వంతెన నిర్మాణం పరిస్థితి కూడా అలాగే దర్శనమిస్తుంది. దాదాపుగా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఐదేళ్లు పూర్తయినా నేటికీ ఇంకా పునాదుల స్థాయిని దాటలేదు వర్షాకాలంలో వరహానది ఉధృతంగా ప్రవహించే సమయంలో గ్రామానికి చెందిన విద్యార్థులు, ప్రజలు సుమారు పది కిలోమీటర్లు ఇతర మార్గంలో ప్రయాణించి ప్రధాన రహదారికి రావాల్సి ఉంటుంది,. పలు సందర్భాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కనీసం స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణిస్తున్నారు అయినా వీటిని పూర్తిచేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విశేషం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొండచిలువ దాడిలో యువకుడికి గాయాలు



ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని గొట్టువాడ శివారు గిరిజన గ్రామమైన అణుకులో ఆదివారం కొండచిలువ దాడిలో గిరిజన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రోజు మాదిరిగానే కొండ ప్రాంతానికి కట్టెలకు సింగిరి చిట్టిబాబు సహా మరో ఇద్దరు అడవికి వెళ్లారు ఆ సమయంలో చిట్టిబాబుపై కొండచిలువ దాడి చేసింది. కొండచిలువను చూసిన మిగతా యువకులు భయభ్రాంతులకు గురై పారిపోయారు, కొండచిలువతో పెనుగులాడుతూ రక్షించండి రక్షించండి అంటూ చిట్టిబాబు కేకలు వేయడంతో అటువైపు వెళుతున్న మరో గిరిజనుడు సిందిరి నర్సింగరావు సహాయంతో తప్పించుకున్నాడు. అప్పటికే కొండచిలువ అతని కుడికాలును తీవ్రంగా గాయపరిచిందిజ విషయం

డోలి సాయంతో ఆసుపత్రికి తరలింపు

తెలుసుకున్న గిరిజనులు, సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు ఆ ప్రాంతానికి చేరుకొని డోలి సాయంతో అణుకు నుండి గొట్టివాడ వరకు బాధితుడు చిట్టిబాబున మోసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోలో కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువచ్చి వైద్యం అందజేశారు.విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, టిడిపి నాయకులు సుంకర బాబ్జి బాధితుడిని పరామర్శించారు కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు చేరుకొని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



పాము కాటు బాధితుడిని డోలిలో మోసుకొస్తున్న గిరిజనులు

మెగా రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం సిఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో సంస్థ అధినేత మావూరి.వెంకటరమణ ఆదేశానుసారం నర్సీపట్నం సిఎంఆర్ షాపింగ్‌మాల్ బ్రాంచ్ మేనేజర్ ఖాసిమ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ డాక్టర్ స్వాతి మాట్లాడుతూ నర్సీపట్నం సిఎంఆర్ సంస్థ రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. నర్సీపట్నం పరిసర ప్రాంత ప్రజలను అత్యవసర సమయాల్లో ఆదుకునేందుకు ఇటువంటి రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను రక్షించడానికి వీలుంటుందని ప్రశంసించారు.ఈ సందర్భంగా 150 మంది వరకు దాతలు రక్తదానం చేశారని సిఎంఆర్ షాపింగ్‌మాల్ మేనేజర్ ఖాసిం తెలిపారు.

14న ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రభుత్వం రద్దు చేసిన ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు వెంటనే కొనసాగించాలని కోరుతూ ఈ నెల 14న నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి ఆందోళన చేపడుతున్నామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. డివిజన్ పరిధిలో ఉన్న 12 మండలాలు ఎస్‌సి, ఎస్‌టి కుల సంఘాలతో దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముట్టడించనున్న నేపథ్యంలో జోగంపేట లో దళిత సంఘాల ఐక్యవేదిక సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ ఐక్యవేదిక నాయకులు చిట్ల చలపతిరావు, గాతాడ సహదేముడు, మార్తి అప్పలరాజు, యాదగిరి దాసు, నక్కపల్లి నూకరాజు, వారా నూకరాజు, కొల్లోజి శివరాజు, జోగంపేట పేటమాలపల్లి కాలనీ ఎస్‌సి పెద్దలు పాల్గొన్నారు.

ఆకాశానికేసి చూస్తున్న అన్నదాతలు

- వర్షాలు లేక ఎండిపోతున్న దమ్ము పొలాలు
- ఖరీఫ్‌లో పూర్తిస్థాయి నాట్లు ప్రశ్నార్థకం
- ఆందోళన చెందుతున్న రైతన్నలు



దమ్ములోనే ఎండిపోతున్న వరి పొలాలు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డల ద్వారా నీరు రావడంతో శరభవరం, వడ్డిప, బుచ్చంపేట, రత్నంపేట గ్రామాల్లోను కల్యాణపు లోవ రిజర్వాయర్ ఊటనీరుతో కంచు గుమ్మల, భోగాపురం, కొమరవోలు ఆవ ఆయకట్టు ప్రాంతాలైన కొమరవోలు, కన్నంపేట, పడాలపాలెం, లగుడు కొత్తూరు గ్రామాల్లో దమ్ములు పడుతూ, వరినాట్లు వేసే పనులు ముమ్మరంగా చేపట్టారు.

ఇంకా కొన్ని గ్రామాల్లో వరినారు ఎదుగలేదని, నీరు లేక రైతులు ఎదురు చూస్తున్నారు. మెరక ప్రాంతాల్లో నీరు చేరిన వెంటనే అందరితో పాటు దమ్ములు చేయగా నీరు లేక ఎండిపోయిన ప్రాంతాలు ఉన్నాయి. మూడు రోజులుగా విపరీతమైన ఎండలకు దమ్ములు ఎండిపోతున్నాయి. వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

మండలంలో 1200 ఎకరాల్లో వరిసాగు సాధారణ విస్తీర్ణం కాగా సుమారు 200 ఎకరాల్లో నాట్లు వేస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 15 కల్లా మండలంలో సాధారణ విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో కనీసస్థాయిలోనూ వరినాట్లు వేయలేదు. గత ఏడాది తొలకరి పంటలైన పప్పు దినుసులైన బొబ్బర్లు, మినుములు, పెసలు పంటల దిగుబడి బాగా వచ్చింది. ఈ ఏడాది ఇతర పంటలు ఏమి లేవు. వరి పంటలనైనే ఆధారపడి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.